సాక్షి
అనంతపురం

గురువారం । 8 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.38,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38,500 పలికాయి.



కూలీల్లో 'ఉపాధి' కాంతులు

ఉపాధి హామీ పథకం కింద కూలీలకు విరివిగా పనులు కల్పిస్తున్నారు. సకాలంలో కూలి డబ్బులు కూడా చెల్లిస్తున్నారు. 8లో



జిల్లా అంతటా బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది.

న్యూస్‌రీల్

11న మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష



రాప్తాడురూరల్: మోడల్ స్కూళ్లలో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి ఈ నెల 11న రాత పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతి స్కూల్‌లోనూ వంద సీట్లు కేటాయించారు. మోడల్ స్కూళ్లలోనే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏ స్కూల్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అదే స్కూల్‌లోనే పరీక్ష రాయాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ తెలిపారు. 11వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

1,500 సీట్లు 2,030 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 15 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఒక్కో స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన 1500 సీట్ల భర్తీకి 2,030 దరఖాస్తులు వచ్చాయి. కొన్ని మోడల్ స్కూళ్లలో కేటాయించిన సీట్లకన్నా దరఖాస్తులు తక్కువ వచ్చాయి. ఇందుకు ప్రధాన కారణం మోడల్ స్కూళ్లలో అన్ని తరగతులకు హాస్టల్ వసతి లేకపోవడమేనని తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనికితోడు ఊళ్లకు దూరంలో ఉన్న ఈ స్కూళ్లకు రోజూ వచ్చి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు.

గుత్తి స్కూల్‌కు అత్యధికం, వజ్రకరూరు స్కూల్‌కు అత్యల్పం

అత్యధికంగా గుత్తి మోడల్ స్కూల్‌కు 305 దరఖాస్తులు రాగా అత్యల్పంగా వజ్రకరూరు స్కూల్‌కు 61 దరఖాస్తులు వచ్చాయి. పామిడి స్కూల్‌కు 208, రాయదుర్గానికి 203, గార్లదిన్నెకు 184, కణేకల్లుకు 72, కళ్యాణదుర్గానికి 151, పుట్లూరుకు 110, రాప్తాడుకు 126, శెట్టూరుకు 129, తాడిపత్రికి 177, ఉరవకొండకు 95, విడపనకల్లుకు 63, యాడికికి 69, యల్లనూరు స్కూల్‌కు 67 దరఖాస్తులు వచ్చాయి.

ఐదు రోజుల్లో వర్షాలు



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజులలో ఒక మోస్తరు, ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 36.8-40.8, రాత్రి ఉష్ణోగ్రతలు 24.8–26.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 57–69, మధ్యాహ్నం 30–42గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

హౌరా- ప్రశాంతి నిలయం మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 7, 9 తేదీల్లో హౌరా – పుట్టపర్తి ప్రశాంతి నిలయం మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 7వ తేదీ మధ్యాహ్నం 3.55 గంటలకు హౌరా జంక్షన్ నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (22831) బయల్దేరి 8వ తేదీ రాత్రి 9.30 గంటలకు ప్రశాంతి నిలయం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 9వతేదీ ఉదయం ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (22832) ఉదయం 7.55 గంటలకు బయల్దేరి 10వ తేదీ మధ్యాహ్నం 1.15 గంటలకు హౌరా చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్లు జిల్లాలోని గుత్తి, అనంతపురం, ధర్మవరం మీదుగా పుట్టపర్తి ప్రశాంతి నిలయం చేరుతాయన్నారు.

గుర్తింపులేని ప్రైవేట్ స్కూళ్లను సీజ్ చేస్తాం

రాప్తాడురూరల్: జిల్లాలో గుర్తింపులేని ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేస్తామని డీఈఓ ఎం.సాయిరామ్ హెచ్చరించారు. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను అప్రమత్తం చేశారు. పాఠశాల ఆవరణం, తరగతి గదులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముందస్తు అడ్మిషన్లు చేపట్టకూడదని, డొనేషన్లు, డెవలప్‌మెంట్ ఫీజులు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించకూడదన్నారు. బస్సులు కలిగిన యాజమాన్యాలు వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని, లైసెన్స్ కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. ఫీజుల వివరాలను కచ్చితంగా ప్రదర్శించాలన్నారు.









పంట కాలం.. రైతు సిద్ధం

ఈ నెల ఒకటిన ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. పంటల సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. వర్షం పడిన ప్రాంతాల్లో పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే సిద్ధమైన ప్రాంతాల్లో విత్తనాలు వేస్తున్నారు. అనంతపురం చుట్టుపక్కల పొలాల్లో సాగు పనుల్లో రైతులు నిమగ్నమైన దృశ్యాలివీ. – జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

చిరుధాన్యాగారం అనంత

- రాష్ట్రంలోనే ఎక్కువ సాగు చేస్తున్న జిల్లాగా గుర్తింపు
- 9 వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో పంటలు
- జీవనశైలి జబ్బుల నియంత్రణలో చిరుధాన్యాలది కీలకపాత్ర
- జిల్లాలో పెరిగిన కొర్రలు, రాగులు, జొన్నల వినియోగం
- మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఔషధంలా మారిన మిల్లెట్స్

పోషక విలువలు అధికంగా ఉండే చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చు. ఇందులో ఉండే ఫైబర్ (పీచు పదార్థం) వల్ల త్వరగా ఆకలి వేయదు. చక్కటి శరీర ఆకృతిని పొందవచ్చు. బీపీ, షుగర్, గుండె సంబంధిత జీవనశైలి జబ్బులను నయం చేసి ఆరోగ్యంగా ఉండటానికి ఉపకరిస్తాయి. రక్తహీనత సమస్య నుంచి కూడా దూరం చేసి రక్తం పెరగటానికి సహకరిస్తాయి. ఇంతటి కీలకపాత్ర పోషించే చిరుధాన్యాల సాగు ఇటీవల బాగా పెరిగింది. సాగులో అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచి చిరుధాన్యాగారంగా విలసిల్లుతోంది.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనూహ్య వాతావరణ పరిస్థితులను తట్టుకుని పండే సామర్థ్యం ఉన్న చిరుధాన్యాలు ఇప్పుడు మనిషికి అత్యవసరమయ్యాయి. కార్బోహైడ్రేడ్స్ అధిక మోతాదులో ఉండే ఆహార పదార్థాల వల్ల ప్రమాదం ఎదురవుతోంది. అసాంక్రమిక వ్యాధులు (మధుమేహం, క్యాన్సర్, గుండెపోటు, రక్తపోటు) వంటివి భారీగా పెరుగుతున్న నేపథ్యంలో చిరు ధాన్యాల వాడకం తప్పనిసరిగా మారింది. ఈ పరిస్థితుల్లో అనంతపురం జిల్లాలో మిల్లెట్స్ (చిరుధాన్యాలు) ఎక్కువగా పండిస్తుండటం గమనార్హం.

రాష్ట్రంలోనే 'అనంత' టాప్

ఏపీ డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టు (ఏపీడీఎంపీ) తాజాగా చిరుధాన్యాల సాగుపై అంచనా వేసింది. ఈ ప్రాజెక్టు కింద 6 జిల్లాలను తొలి దశలో పరిశీలనకు తీసుకున్నారు. అందులో ఎక్కువగా చిరుధాన్యాలను పండించే జిల్లాగా అనంతపురం మొదటి స్థానంలో నిలిచింది. అధిక వర్షాభావ ప్రాంతాలను ఎంపిక చేసి ఈ ప్రాంతాల్లో మిల్లెట్స్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక దశలో ఎలాంటి పంటలు వేయాలో తెలియని చిన్నకారు రైతులు వలస వెళ్లేవారు. ఇలాంటి పరిస్థితులను నియంత్రించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టారు. చిరుధాన్యాలను పండించడమే కాదు వాటిని అమ్ముకునే విషయంలో అధికార యంత్రాంగం సూచనలు, సలహాలు ఇస్తోంది.

చిరుధాన్యాల ప్రాముఖ్యత..

చిరు ధాన్యాల్లో జొన్నలు, సజ్జలు, కొర్రలు, వరిగెలు, రాగులు ప్రధానమైనవి. వీటితో పాటు ఆరికెలు, అందుకొర్రలు, సామలు, ఊదలు కూడా చిరునాధాన్యాలే. వీటిలో శరీరానికి అవసరమైన విటమిన్ బీ 12, బీ 17, బీ 6 ఎక్కువగా లభిస్తాయి. ఎక్కువగా పీచు పదార్థాలుంటాయి. సగటున 70 గ్రాముల పోషకాలు, 10 గ్రాముల మాంసకృత్తులు, 1.6 గ్రాముల పీచు, 4.1 మిల్లీ గ్రాముల ఇనుము, 25 మిల్లీ గ్రాముల క్యాల్షియం లభిస్తుంది. చిరుధాన్యాల వినియోగం మెరుగైన జీర్ణప్రక్రియకు తోడ్పడుతుంది. జీవనశైలి వ్యాధులను నియంత్రించడంలో మిల్లెట్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. తాజాగా మిల్లెట్స్ వాడకంపై రాష్ట్ర ప్రభుత్వం విశేష ప్రాచుర్యం కల్పిస్తోంది.

జిల్లాల వారీగా చిరు ధాన్యాల సాగు

ఉమ్మడి జిల్లా	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
అనంతపురం	9,188
చిత్తూరు	7,395
కర్నూలు	6,072
వైఎస్సార్	1,668
ప్రకాశం	3,527

చిరుధాన్యాల సాగుతో ప్రయోజనం



సాధారణ పంటల సాగులో తరచూ వస్తున్న నష్టాల నుంచి బయటపడేందుకు చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాను. ఏటా క్రమం తప్పకుండా అర ఎకరం లేదా ఎకరంలోనైనా రాగి పంట సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నాను. పెట్టుబడి తక్కువతో పాటు శ్రమకు తగ్గ ప్రతిఫలం కూడా దక్కుతోంది. ఎకరానికి ఎంత తక్కువన్నా 15 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధిస్తాం. మారుతున్న కాలానుగుణంగా జీవనశైలి వ్యాధులు కూడా పెరుగుతుండడంతో మార్కెట్లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంది. పంట కోతల సమయంలోనే క్వింటా రూ.3,200 ప్రకారం కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. మార్కెట్‌కు తీసుకెళ్లే కష్టం కూడా తప్పుతోంది. రాగి పంటేకాక ఖరీఫ్‌లో చాలా మంది సజ్జ, ఉలవ, పెసర, కొర్ర లాంటి పంటలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.
– మాల కెంచన్న, రైతు, కోనాపురం

చిరుధాన్యాల సాగుకు అనువైన వాతావరణం



అనంతపురం జిల్లాలో చిరుధాన్యాల సాగుకు మంచి వాతావరణం ఉంది. గతంతో పోల్చితే సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. కానీ చిరుధాన్యాలు పండిన తర్వాత వాటి శుద్ధి చేసే (ప్రాసెసింగ్) యూనిట్లు ఉంటే మరింతగా బావుంటుంది.
– మల్లారెడ్డి, వ్యవసాయ మిషన్ సభ్యుడు

మిల్లెట్స్ శ్రేయస్కరం



మధుమేహంతో ఇబ్బంది పడే వారు అన్నం తినడం ద్వారా చక్కెర స్థాయిలు పెరగడంతో పాటు మళ్లీ త్వరగా ఆకలి అయ్యేందుకు అవకాశం ఉంటుంది. చిరుధాన్యాల్లో ఉండే తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ కారణంగా చక్కెర స్థాయిలు నిదానంగా పెరుగుతాయి. దీంతో పాటుగా ఫైబర్, విటమిన్స్, మినరల్స్ పుష్కలం. గ్లుటిన్ ఉండదు. మధుమేహంతో బాధపడే వారికి మిల్లెట్స్ శ్రేయస్కరం.
–డాక్టర్ రజిని, అసిస్టెంట్ ప్రొఫెసర్, సర్వజనాస్పత్రి

ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

- ఆర్థిక ఇబ్బందుల్లోనూ సాహసోపేత నిర్ణయంపై ఉద్యోగుల హర్షం

రాప్తాడురూరల్/అనంతపురం టవర్ క్లాక్: ప్రభుత్వ ఉద్యోగుల జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. బుధవారం ఏపీ కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన ఐదు అంశాలపై ఆమోదం తెలుపుతూ తీర్మానం చేయడంపై ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లోనూ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అంటున్నారు. ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.అశోక్‌కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు హెచ్.గిరిధర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఓబుళపతి, జిల్లా అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి కె.గోవిందరెడ్డి, నాయకులు రాధాకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, రమణ, విశ్వనాథరెడ్డి, ఓబిరెడ్డి, సురేష్‌కుమార్, పీఆర్టీయూ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బాబయ్య, శ్రీరాములు, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.నరసింహారెడ్డి, గ్రంథాలయ అధికారి బిల్లే శంకర్ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, జిల్లా కేంద్రాల్లో 16 శాతం హెచ్‌ఆర్‌ఏ అమలు, సుమారు 10,167 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పింఛన్ విధానంలో మార్పులతో ఉద్యోగులకు మేలు కలిగే అంశాల అమలుకు ఆమోదం చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. పాత పెన్షన్ స్కీమ్‌కు ప్రత్యామ్నాయంగా జీపీఎస్ తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నారు. చివరి బేసిక్ పేలో 50 శాతం ఇవ్వడం, డీఏ చేర్చిన జీపీఎస్ విధానం దాదాపు పాత పెన్షన్ స్కీమ్‌కు సమానంగా ఉందంటున్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

కణేకల్లు: రెవెన్యూ అధికారుల సహకారంతో భూ సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఎస్‌ఐ దుగ్గిరెడ్డిని ఆదేశించారు. కణేకల్లు పోలీసుస్టేషన్‌ను ఆయన బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా భూ సమస్యలకు సంబంధించి 'స్పందన'లో అర్జీలు వస్తున్నాయని ఎస్పీ తెలిపారు. భూ వివాదాల్లో సివిల్ కేసులు కాకుండా చిన్న, చిన్న సమస్యలతో ఇరువర్గాలు ఇబ్బందులు పడుతుంటే రెవెన్యూ అధికారులతో చర్చించి పరిష్కరించాలని సూచించారు. రాత్రి పూట గస్తీలు నిర్వహించి చోరీలు జరగకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రమాదాలను నియంత్రించాలన్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష

- ముగిసిన ఎర్రితాతస్వామి ఉత్సవాలు

బెళుగుప్ప: మండల కేంద్రం బెళుగుప్పలోని శాంతిధామంలో అవధూత సద్గురు ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరిరోజు బుధవారం స్వామివారు ఛత్రప్రభ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎర్రితాత మహరాజ్‌కీ జై అంటూ భక్తుల సావమివారి నామస్మరణతో శాంతిధామం ప్రతిధ్వనించింది. అనంతరం ఉట్లమాను పరుష నిర్వహించారు. బురదపూసిన పొడవాటి స్తంభాన్ని ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. అంచలంచెలుగా పైకి ఎగబాకుతూ పట్టుతప్పి కిందపడటం.. మళ్లీ ప్రయత్నించి ముందుకు సాగడం వంటి దృశ్యాలు ఉత్కంఠను రేపాయి. చివరకు సమష్టిగా స్తంభం చుట్టూ నిలబడగా.. ఒక యువకుడు వారి మీదుగా బురద స్తంభమైన ఉట్లమానును ఎక్కి స్వామివారి ప్రసాదంగా అక్కడ ఉంచిన వివిధ రకాల పండ్లు, నారికేళాన్ని అందుకుని విజయదరహాసం చేశాడు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామంలో కోలాట పాటలు, భజనలు ఆకట్టుకున్నాయి. ఎస్‌ఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఛత్రప్రభ అలంకరణలో ఎర్రితాతస్వామి



ఉట్లమాను ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ తహసీల్దార్ మృతి

- కారు ముందు టైరు పంక్చర్
- అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వైనం
- డీటీ బెస్త కరుణాకర్ అక్కడికక్కడే మృతి
- భార్య, కుమారుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కారు







కరుణాకర్ (ఫైల్), ప్రమాద స్థలంలో మృతి చెందిన డీటీ కరుణాకర్, గాయపడిన డీటీ భార్య వరలక్ష్మి

పెద్దవడుగూరు/అమరాపురం : పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్–44)పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డిప్యూటీ తహసీల్దార్ బెస్త కరుణాకర్ (48) మృతిచెందారు. ఈయన ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలో పని చేస్తున్నారు. ఇదే ప్రమాదంలో కరుణాకర్ భార్య వరలక్ష్మి, కుమారుడు పార్థసాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. డిప్యూటీ తహసీల్దార్ బెస్త కరుణాకర్ అనంతపురం నగరంలో నివాసముంటున్నారు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి తన కారు (ఏపీ02 సీఏ 8568)లో కర్నూలుకు వెళ్లి అక్కడి ఆస్పత్రిలో చూపించుకున్నారు. తర్వాత అనంతపురానికి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలోని మిడుతూరు వద్ద వస్తుండగా కారు ముందు టైరు పంక్చర్ అయ్యింది. దీంతో అదుపుతప్పి వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారు ధ్వంసం కాగా.. డ్రైవింగ్ సీట్లో ఉన్న కరుణాకర్ బయటకు ఎగిరిపడి అక్కడికక్కడే మృతిచెందారు. ఎయిర్‌బ్యాగ్ తెరచుకున్నప్పటికీ వేగంగా బయటకు పడడం వల్ల ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఆయన పక్కనే కూర్చొన్న భార్య వరలక్ష్మి, వెనుక సీట్లో ఉన్న కుమారుడు పార్థసాయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి.. వివరాలు సేకరించారు. డీటీ కరుణాకర్ మృతికి అమరాపురం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ సురేష్‌కుమార్ అనంతపురానికి వెళ్లారు.

కూలీల్లో ఉపాధి కాంతులు



ఏ ఇల్లు చూసినా కుటుంబ సభ్యులతో కళకళలాడుతోంది. నాలుగేళ్ల క్రితం వరకు ఉపాధి కోసం కుటుంబాలకు కుటుంబాలు మూటాముల్లె సర్దుకుని వలసపోయేవి. అక్కడక్కడా వృద్ధులు ఇళ్ల వద్ద ఉండేవారు. తాళాలు వేసిన ఇళ్లు బోసిపోయి ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు కనుమరుగయ్యాయి. పల్లెల్లో ప్రతి ఇంటి వద్దా సందడి కనిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అందరూ ఉంటున్నారు. కారణం.. ఉపాధి హామీ పథకం కింద అడిగిన ప్రతి ఒక్కరికీ పని చూపిస్తుండటమే. కూలి డబ్బులు కూడా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అందిస్తుండటంతో కుటుంబ పోషణకు ఢోకా లేకుండా పోయింది.

- రోజుకు లక్ష మందికి పైగా కూలీలు 'ఉపాధి' పనుల్లోకి
- జూలై లక్ష్యంలో 50 శాతం పనిదినాలు పూర్తి
- వలసలకు అడ్డుకట్ట వేసిన రాష్ట్ర ప్రభుత్వం



భూపసముద్రం వద్ద 'అమృత్ సరోవర్' పనుల్లో పాల్గొన్న ఉపాధి కూలీలు

రాయదుర్గం: కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అడిగిన ప్రతి కూలీకీ తప్పనిసరిగా పని చూపించి కొండంత భరోసా కల్పిస్తోంది. సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించి పారదర్శకంగా పథకం అమలు చేస్తుండటంతో కూలీలు ఉన్న ఊరిలోనే పనులు చేసుకుంటున్నారు. చేసిన పనికి తగిన వేతనం సకాలంలోనే అందుతోంది. దీంతో వలసలకు పూర్తిగా చెక్ పడినట్లయ్యింది. జిల్లాలో రోజుకు గరిష్టంగా లక్ష మందికి పైగా కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,40,94,048 పని దినాలను లక్ష్యంగా ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఇందులో ఏప్రిల్ నుంచి జూలై వరకు వ్యవసాయ పనులు ఉండకపోవడంతో... ఆ సమయంలో 81,79,887 పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు చేపట్టారు. ఇందులో ఇప్పటికే 45,58,836 పనిదినాలు పూర్తయ్యాయి. మిగిలిన 36,21,051 పని దినాలను ఈ రెండు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.102.81 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం కూలీల ఖాతాలకు జమ చేసింది. వీరిలో 34 కుటుంబాలు 100 రోజుల పనిదినాలు సద్వినియోగం చేసుకున్నాయి. రోజు కూలీ ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి రూ.257 నుంచి రూ.272కు పెరిగింది.

ప్రయోజనం చేకూర్చే పనులకే పెద్దపీట

ఉపాధి హామీ పథకం కింద ప్రయోజనం చేకూర్చే పనులకే పెద్దపీట వేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండేందుకు కందకాల తవ్వకం, భూమి చదును చేయటం, చెరువుల అభివృద్ధి, పంట కాల్వల తవ్వకం, కొండ ప్రాంతాల్లో ట్రెంచుల తవ్వకం లాంటి పనులు విస్తృతంగా చేపడుతున్నారు. కూలీల వేతనం కూడా పెరగడంతో ఎక్కువ మంది పనుల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వలసలకు అడ్డుకట్ట

ఇదివరకు వలసలకు అనంతపురం జిల్లా కేరాఫ్‌గా నిలిచేది. ఇప్పుడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వలస మాటే వినపడకుండాపోయింది. ఉన్న ఊళ్లలోనే అడిగిన వారందరికీ పనులు కల్పించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 3,03,306 జాబ్ కార్డులు ఉండగా, 5,68,637 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో 4,69,813 మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు.

ఊర్లోనే ఉపాధి



ఉన్న ఊర్లోనే ఉపాధి కల్పిస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ పనులకెళ్తున్నాం. వారానికి రూ.3 వేలకు పైగా వేతనం అందేలా పనులు చేస్తున్నాం. సగటున నెలకు రూ.12 వేలకు పైబడి గిట్టుబాటు అవుతోంది. ప్రభుత్వం కూలి డబ్బు కూడా సకాలంలో చెల్లిస్తుండటంతో కుటుంబ పోషణ సాఫీగా సాగిపోతోంది.

– ధనలక్ష్మి, ఉపాధి మేట్, కలుగోడు

లక్ష్య ఛేదనకు కసరత్తు



ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు ఊపందుకునేలోగా 60 నుంచి 70 శాతం పనులు పూర్తి చేయించి లక్ష్యాన్ని ఛేదించేలా కసరత్తు చేపట్టాం. అడిగిన ప్రతి కూలీకీ పని కల్పించే బాధ్యత తీసుకుంటున్నాం. ఈ కారణంగా జిల్లాలో వలస మాటే వినపడకుండా చేస్తున్నాం. కూలీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి పనీ పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టాం.

– వేణుగోపాల్‌రెడ్డి, పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ

క్లుప్తంగా

ఎండోమెంట్ ఏసీగా ఆదిశేషు నాయుడు



ఆదిశేషునాయుడును అభినందిస్తున్న కర్నూలు ఏసీ రామాంజినేయులు

అనంతపురం కల్చరల్: జిల్లా ఎండోమెంటు సహాయ కమిషనర్‌గా ఆదిశేషునాయుడు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో పనిచేసిన రామాంజినేయులను కర్నూలు జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రామాంజినేయులు నుంచి ఆదిశేషు నాయుడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలు ఆలయాల ఈఓలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రామాంజినేయులను ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. జిల్లాలో ఎండోమెంట్ పరంగా ఎన్నో సమస్యలను సమర్థవంతంగా రామాంజినేయులు పరిష్కరించారని కొనియాడారు. కార్యక్రమంలో ఈఓలు అక్కిరెడ్డి, బాబు, బీఆర్ వెంకటేశులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ



హుండీని బద్దలుగొట్టిన దృశ్యం

కణేకల్లు: మండలంలోని కె.మారెంపల్లిలో వెలసిన అతి పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ఆలయ తలుపులకు వేసిన తాళాన్ని బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. సీతమ్మ విగ్రహం మెడలో ఉన్న బంగారు మంగళ సూత్రాన్ని, హుండీలోని నగదును అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం ఆలయానికి చేరుకున్న పూజారి గోవిందప్ప చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి ఆలయ పాలక మండలి సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆరా తీశారు. ఎనిమిది నెలలుగా హుండీ తెరవలేదని సుమారు రూ.20వేల వరకు డబ్బు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

సీఓల బదిలీలు

అనంతపురం క్రైం: నగర పాలక సంస్థ మెప్మా విభాగంలో పనిచేస్తున్న కొందరు కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓ) బదిలీ అయ్యారు. ఈ మేరకు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సీఓ లక్ష్మీనారాయణను ధర్మవరం మునిసిపాలిటీకి, నాగపల్లవిని గుంతకల్లు మునిసిపాలిటీకి, ఎస్.దూద్‌పీరాను పుట్టపర్తి మునిసిపాలిటీకి బదిలీ చేశారు. దీంతో వీరిని నగరపాలక సంస్థ కమిషనర్ బుధవారం రిలీవ్ చేశారు. అలాగే కళ్యాణదుర్గం మునిసిపాలిటీ నుంచి కళావతి, గుంతకల్లు మునిసిపాలిటీ నుంచి పార్వతి బదిలీపై నగరపాలక సంస్థకు వచ్చారు. వీరిద్దరూ కమిషనర్ రమణారెడ్డి వద్ద రిపోర్టు చేసుకున్నారు.

మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం క్రైం: రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలోని 74 వార్డు సచివాలయాలు, 11 గ్రామ సచివాలయాల పరిధిలో 13 నెలలుగా సాగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం దిగ్విజయంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అంటే బాధ్యతగా ఉండాలని, ప్రజలకు సేవకులుగా ప్రజాప్రతినిధులుండాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జగన్ ప్రభుత్వమంటే జనం ప్రభుత్వంగా తేటతెల్లమైందన్నారు. ఈ స్ఫూర్తితో మరో కార్యక్రమం ద్వారా రెట్టింపు ఉత్సాహంతో ప్రజలతో మమేకమై సేవలు అందిస్తామన్నారు. ఈ నాలుగేళ్లలో నియోజకవర్గ పరిధిలో రూ.650 కోట్లతో రోడ్లు, కాలువలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. రూ.2,200 కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు నేరుగా అందించామన్నారు. 23వేల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామన్నారు. ఇంత గొప్ప అభివృద్ధి కేవలం సీఎం వైఎస్ జగన్ వల్లనే సాధ్యమైందన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించి మంజూరైన రూ.17 కోట్లతో అంతర్గత రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి చొరవతో మంజూరైన రూ.25 కోట్లతో నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా సాగాయన్నారు. టీడీపీ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధులు అంతర్గత కలహాలు, మాటలకే పరిమితమై అభివృద్ధిని విస్మరించారన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వారి ఖాతాలోకి వేసుకోవాలన్న తాపత్రయం అధికారంలో ఉన్నప్పుడు చూపించి ఉంటే ప్రజలకెంతో మేలు జరిగి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. అనంతపురం నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అనంత తీసుకున్న చొరవను అభినందించారు. సమావేశంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలకు చేరుతున్న ఐఎఫ్‌పీలు



గుంతకల్లులోని ఎస్‌ఆర్‌కే మునిసిపల్ స్కూల్‌కు చేరిన ఐఎఫ్‌పీలు

రాప్తాడు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ బోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలివిడతగా 'మన బడి నాడు–నేడు' కింద అభివృద్ధి చేసిన 534 స్కూళ్లల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. 6–10 తరగతులకు డిజిటల్ బోధనకు అవసరమైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు (ఐఎఫ్‌పీ) జిల్లాకు చేరుతున్నాయి. ప్రాథమిక పాఠశాలల తరగతుల బోధనకు స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేయనున్నారు. బుధవారం గుంతకల్లు నియోజకవర్గంలో వివిధ స్కూళ్లకు ఐఎఫ్‌పీలు చేరవేశారు. జిల్లాలో మొత్తం 534 స్కూళ్లకు 759 స్మార్ట్ టీవీలు, 1595 ఐఎఫ్‌టీలు కేటాయించారు. ఇందులో అనంతపురం నియోజకవర్గంలో 43 స్కూళ్లకు 60 స్మార్ట్ టీవీలు,189 ఐఎఫ్‌పీలు, గుంతకల్లు నియోజకవర్గంలో 61 స్కూళ్లకు 82 స్మార్ట్ టీవీలు, 219 ఐఎఫ్‌పీలు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 75 స్కూళ్లకు 95 స్మార్ట్ టీవీలు, 205 ఐఎఫ్‌పీలు, రాప్తాడు నియోజకవర్గంలో 12 స్కూళ్లకు 15 స్మార్ట్ టీవీలు,44 ఐఎఫ్‌పీలు, రాయదుర్గం నియోజకవర్గంలో 128 స్కూళ్లకు 224 స్మార్ట్ టీవీలు, 358 ఐఎఫ్‌పీలు, శింగనమల నియోజకవర్గంలో 76 స్కూళ్లకు 94 స్మార్ట్ టీవీలు, 193 ఐఎఫ్‌పీలు, తాడిపత్రి నియోజకవర్గంలో 59 స్కూళ్లకు 67 స్మార్ట్ టీవీలు, 159 ఐఎఫ్‌పీలు, ఉరవకొండ నియోజకవర్గంలో 84 స్కూళ్లకు 122 స్మార్ట్ టీవీలు, 229 ఐఎఫ్‌పీలు రానున్నాయి.

పూడికతీత పనుల్లో వేగం పెంచాలి

- గ్రౌండ్ వాటర్ డీడీ జయరామిరెడ్డి

రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట/కణేకల్లు: భూగర్భ జలాల పెంపు కోసం చెరువుల్లో చేపట్టిన అమృత్ సరోవర్ పనులను వేగవంతం చేయాలని భూగర్భ జల శాఖ డీడీ జయరామిరెడ్డి ఆదేశించారు. అమృత్ సరోవర్ కింద వేపరాల, టి.వీరాపురం, గుమ్మఘట్ట మండలం నేత్రపల్లి, కణేకల్లు మండలం పెనకలపాడు, పులచెర్ల చెరువుల్లో చేపట్టిన పూడికతీత పనులను బుధవారం రాష్ట్ర బృందంతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఏపీడీ జయకుమార్, ఏపీఓ నీరజ, టెక్నికల్ అసిస్టెంట్లకు పలుసూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో స్టేట్ టీం హెచ్ఓ గౌసియా, డీఆర్‌పీ కృష్ణ, ఎంపీడీఓ కొండయ్య, ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు, ఏపీఓ సురేశ్, టీఏ మల్లికార్జున పాల్గొన్నారు.

మోసగాడిపై కేసు నమోదు

యాడికి: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను వంచనకు గురిచేసిన మోసగాడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపిన మేరకు.. ఉద్యోగాలు ఇప్పిస్తానని యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి, రియాజుద్దీన్, కిరణ్ తదితరులతో చిత్తూరు జిల్లా కార్వేటి మండలానికి చెందిన లక్ష్మణ్ రూ.4.60 లక్షలు వసూలు చేసుకున్నాడు. అయితే ఇప్పటి వరకూ ఉద్యోగాలు కల్పించలేదు. నాలుగు నెలలుగా ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన అనిల్‌కుమార్‌రెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేశారు.

'అప్పర్ భద్రతో రాయలసీమకు ముప్పు'

గుంతకల్లు: కర్ణాటకలో చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టు పనులు పూర్తయితే రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్ణాటకలో చేపట్టిన అప్పర్ భద్ర, నవలి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమ ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందకుండా పోతుందన్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 150 అడుగుల ఎత్తులో పోలవరం ప్రాజెక్టును నిర్మించాలని డిజైన్ చేస్తే దానిని ప్రస్తుతం 135 అడుగుల ఎత్తుకు కేంద్ర ప్రభుత్వం కుదించడం దారుణమన్నారు. ఆదానీ, అంబానీకు మేలు చేయడానికి విద్యుత్ వినియోగదారులపై పదేపదే విద్యుత్ చార్జీలు పెంచుతూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకూ రైతు గర్జన పేరిట ప్రచార జాతను చేపట్టనున్నట్లు తెలిపారు. 21న కలెక్టరేట్ వద్ద రైతు గర్జనపై నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నాయకులు రాము, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు నేడు ఎన్నిక

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అంతా సిద్ధం చేశారు. బత్తలపల్లి ఎంపీపీగా పని చేసిన గుర్రం వనజ తన పదవికి, చెన్నేకొత్తపల్లి వైస్ ఎంపీపీ శ్రీశైలం ప్రవీణ రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఎన్నిక నిర్వహించనున్నారు. అలాగే రాయదుర్గం వైస్ ఎంపీపీ సత్యనారాయణ మృత్యువాత పడడంతో అక్కడ ఎన్నిక అనివార్యమైంది. విడపనకల్లు ఎంపీపీగా కరణం పుష్ప ఎన్నిక కావడంతో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించనున్నారు. తనకల్లు మండల కో–ఆప్షన్ సభ్యుడు మరణంతో ఖాళీగా ఏర్పడ్డ ఆ స్థానానికీ అధికారులు ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయా మండల పరిషత్ అధికారులు పూర్తి చేశారు.

వివాహిత దుర్మరణం

బుక్కరాయసముద్రం: జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన ఎరికల శిల్ప (32)కు ఆరు నెలల క్రితం శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన లక్ష్మన్నతో వివాహమైంది. బుధవారం ఉదయం భర్తతో కలసి ద్విచక్ర వాహనంపై అనంతపురానికి వస్తుండగా మార్గమధ్యంలో 44వ జాతీయ రహదారిపై వడియంపేట వద్ద స్పీడ్ బ్రేకర్ రాగానే లక్ష్మణ్ణ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో అదుపు తప్పి శిల్ప కిందపడింది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ శిల్ప తలపై నుంచి దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మరో ఇద్దరు గుప్తనిధుల వేటగాళ్ల అరెస్ట్

గుత్తి: చారిత్రక గుత్తి కొండపై గత ఆదివారం గుప్తనిధుల కోసం తవ్వకాలు సాగిస్తూ పురావస్తు శాఖ అధికారుల రాకతో తప్పించుకుని పారిపోయిన ముగ్గురిలో ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు తెలిపారు. ఆదివారం ఏడుగురు పట్టుబడగా.. ముగ్గురు తప్పించుకుని పారిపోయిన విషయం తెలిసిందే. వీరిలో కోనాపురం నివాసి వెంకటప్ప, కోనుప్పలపాడుకు చెందిన వెంకటశివారెడ్డిని అరెస్ట్ చేసి, పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

ఉపాధి కూలీ మృతి

కణేకల్లు: మండలంలోని పెనకలపాడులో ఉపాధి కూలీ బోయ హనుమంతు (55) అకాల మృత్యువాతపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు.. బుధవారం ఉదయం ఉపాధి పనుల్లో పాలు పంచుకున్న హనుమంతు... మట్టి పని చేస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి అంటూ కొద్ది సేపు కూర్చొన్నాడు. తోటి కూలీలు ఉపశమన చర్యలు చేపట్టి కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. అతనికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు బాలాజీ ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- అధికారులను ఆదేశించిన హౌసింగ్ పీడీ కేశవనాయుడు

అనంతపురం టౌన్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ సిబ్బందిని ఆ శాఖ పీడీ కేశవనాయుడు ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిపై జిల్లాలోని హౌసింగ్ ఏఈలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జూలై 15వ తేదీలోపు 20 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్యాన్ని నిర్దేశించినట్లు పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఈ విషయంగా లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. ఆప్షన్–3 కింద చేపట్టే ఇళ్ల నిర్మాణాల అంశంలో గృహ నిర్మాణ సంస్థ డీఈలు, ఏఈలు సంయుక్తంగా కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుని ముందుకు పోవాలన్నారు. ఇప్పటి వరకూ ఆప్షన్ –3 కింద 900 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని, ఈ సంఖ్యను మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

టీటీసీ-2023 థియరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడురూరల్: టీటీసీ (టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్)–2023 (లోయర్ గ్రేడ్) థియరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టులో ఈ పరీక్షలు ఉంటాయి. 42 రోజుల శిక్షణ కోర్సు చేస్తున్న అభ్యర్థులతో పాటు గతంలో ఈ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు ఈ నెల 20వ తేదీ లోపు www.bre.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రూ.150 రుసుం చెల్లించి, పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ. 50 అపరాధ రుసుంతో ఈ నెల 29వ తేదీ వరకు గడువు ఉంటుంది. మ్యాన్యువల్ చలానాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబడవు.

ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఐఈఆర్పీలు

రాప్తాడు రూరల్: ఉమ్మడి జిల్లా సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్‌ల (ఐఈఆర్పీ)లో ఎవరైనా అనారోగ్యాలతో బాధపడుతుంటే ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఏపీఓ ఎం.సాయిరామ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను సమగ్ర బ్లాగ్‌స్పాట్‌లో ఉంచారు. దరఖాస్తులను గురు, శుక్రవారాల్లో సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలి. అందిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ ద్వారా పరిశీలన చేయిస్తారు.

తపాలా శాఖలో బదిలీలకు మోక్షం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా డివిజన్‌లో బదిలీలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇంత కాలం రెగ్యులర్ సూపరింటెండెంట్ లేని కారణంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్న అధికారి బదిలీల ప్రక్రియను పట్టించుకోకపోవడంతో 'తపాలా శాఖలో బదిలీలకు గ్రహణం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై నూతనంగా బాధ్యతలు తీసుకున్న సూపరింటెండెంట్ హరిబాబు తక్షణమే స్పందించారు. బదిలీలకు సంబంధించిన ఫైల్ తెప్పించుకుని ఒకే ప్రాంతంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 26 మంది సబ్ పోస్ట్‌మాస్టర్లు, పోస్టల్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ అప్పటికప్పుడు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 31 నాటికి పూర్తి కావాల్సిన ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో బదిలీ అయిన ఉద్యోగులు ఇక ఆలస్యం చేయకుండా తక్షణమే కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు.

క్లుప్తంగా

అభాగ్యునికి అమ్మ చేయూత



లక్ష్మీనారాయణ కుటుంబానికి నిత్యావసర వస్తువులు, నగదు అందిస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న అభాగ్యుడు ఉదయ్ కుమార్ కుటుంబానికి అమ్మ సంస్థ అండగా నిలిచింది. వివరాలు.. ధర్మవరానికి చెందిన లక్ష్మీనారాయణ, ఓబుళమ్మ దంపతుల కుమారుడైన ఉదయ్‌కుమార్ పుట్టుకతోనే దివ్యాంగుడు. ఉదయ్‌కుమార్ గత సంవత్సరం అక్టోబర్‌లో ఓ రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పాగొట్టుకుని మంచానికి పరిమితమయ్యాడు. ఈ పరిస్థితుల్లో అమ్మ సంస్థ అధినేత తరిమెల రమణారెడ్డి విషయం తెలుసుకుని బుధవారం వారికి రూ.30 వేల నగదుతో పాటూ మరో రూ.8 వేల విలువ చేసే సర్జికల్ కాట్, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, వస్త్రాలనందించి ఆదుకున్నాడు. దాతలు స్పందించి ఉదయ్‌కుమార్ కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశాడు.

పర్యావరణ స్పృహ కల్గించాలి



కోగటం విజయభాస్కర రెడ్డిని సత్కరిస్తున్న డ్యాన్స్ మాస్టర్లు

అనంతపురం కల్చరల్: కళాకారులు పర్యావరణ స్పృహ కల్గించేలా అందరిలో అవగాహన పెంచాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి స్థానిక కృష్ణకళామందిరంలో స్టైల్ డాన్సు అకాడమీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. రవిమాస్టర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి కోగటం విజయభాస్కరరెడ్డి ఆత్మీయ అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రవి, రమణ చిన్నారులను ప్రోత్సహిస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రమేష్‌నీల్ యాంకరింగ్, చిన్నారులు చేసిన డ్యాన్సులు ఆడిటోరియాన్ని హోరెత్తించాయి. కార్యక్రమంలో సీనియర్ డ్యాన్స్ మాస్టర్లు విష్ణు, కత్తి విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, పత్రికా సంపాదకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ ప్రవీణ్ అనొకర్

అనంతపురం: మినీ సబ్ జూనియర్ అండర్–11, 13 బాల, బాలికల సాఫ్ట్‌బాల్ జాతీయ టోర్నమెంట్ అనంత క్రీడా గ్రామంలో రెండో రోజూ హోరాహోరీగా సాగింది. క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ ప్రవీణ్ అనొకర్, రాష్ట్ర సీఈఓ వెంకటేశ్, తెలంగాణ సీఈఓ శోభన్ ప్రారంభించారు. అండర్–13 బాలుర విభాగంలో తెలంగాణపై ఆంధ్రప్రదేశ్ 11–3, రాజస్తాన్‌పై మధ్యప్రదేశ్ 6–0, గుజరాత్‌పై పాండిచ్చేరి 12–2 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. అండర్–13 బాలికల విభాగంలో కేరళపై ఆంధ్రప్రదేశ్ 12–0, తెలంగాణపై ఆంధ్రప్రదేశ్ 6–0,. ఆంధ్రప్రదేశ్‌పై మధ్యప్రదేశ్ 2–1, కేరళపై తెలంగాణ 14–1 తేడాతో గెలుపొందాయి. అండర్–11 బాలుర విభాగంలో మధ్యప్రదేశ్‌పై ఆంధ్రప్రదేశ్ 15–3, తెలంగాణపై మధ్యప్రదేశ్ 8–1 గెలుపొందాయి. అండర్ –11 బాలికల బాలికల విభాగంలో తెలంగాణపై ఆంధ్రప్రదేశ్ 11–1, ఆంధ్రప్రదేశ్‌పై మధ్యప్రదేశ్ 4–3 పాయింట్లతో గెలుపొందాయి.

పీజీ సీట్ల కేటాయింపుపై సంబరాలు



ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవిని సన్మానించిన దృశ్యం

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాలలోని అనాటమీ విభాగానికి 9 పీజీ సీట్ల కేటాయింపుపై బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ చాంబర్‌లో అనాటమీ, తదితర విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులు సంబరాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి కేక్ కట్ చేసి వైద్యులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అనాటమీ విభాగానికి అత్యధికంగా పీజీ సీట్లు రావడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో అనాటమీ హెచ్‌ఓడీ డాక్టర్ ఉమామహేశ్వర రావు, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ శంకర్, ఎస్ఎంసీ కమిటీ డాక్టర్ బీఆర్ శ్యాంప్రసాద్, డాక్టర్ శ్రీనివాస రావు, డాక్టర్ పద్మశ్రావణి, అధ్యాపక బృందం సహజీర్, భాను పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- 14న మహిళా సహకార డెయిరీ ప్రారంభిస్తాం
- ఎక్కువ ఇళ్లు మంజూరు చేయించిన వలంటీర్లకు నగదు బహుమానం
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకొచ్చిన వలంటర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరయ్యారు. మొదటగా సీఎం జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడంలో వలంటీర్లే కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్లు సీఎంగా పనిచేసినా చంద్రబాబు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఎన్నికలు వస్తుండటంతో మరోసారి అబద్ధపు హామీలతో జనం ముందుకు వచ్చి మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. డబ్బు కోసం, స్వార్థం కోసం తప్ప చంద్రబాబు అధికారాన్ని దేని కోసం ఉపయోగించలేదన్నారు. అనంతరం సేవా రత్న, సేవామిత్ర అవార్డులు వచ్చిన వలంటీర్లకు ఘనంగా సన్మానించారు.

10 వేల మంది మహిళలకు ఉపాధి

నియోజకవర్గంలోని తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ ద్వారా 10 వేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా డెయిరీని ప్రారంభిస్తామన్నారు. మొదటగా 10 వేల లీటర్లతో ప్రారంభించి నెలకు లక్ష లీటర్ల వరకు రైతుల దగ్గర నుంచి పాలు సేకరిస్తామన్నారు. సొంత డబ్బుతో సహకార డెయిరీ ఏర్పాటు చేసి మహిళలకు అండగా నిలుస్తున్నామని తెలియజేశారు. పాడి పశువుల పెంపకంపై ఆసక్తి ఉండి పాలు ఉత్పత్తి చేయాలనుకునేవారికి బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామన్నారు.

ఎక్కువ ఇళ్లు మంజూరు చేయిస్తే..

'పేదలందరికీ ఇళ్ల పథకం' కింద మండలంలోని సచివాలయాల్లో ఏ గ్రామ వలంటీర్ ఇళ్లు ఎక్కువ మంజూరు చేయిస్తారో వారికి రూ.50 వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.20 వేలు బహుమతిగా అందచేస్తామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ప్రకటించారు. రామగిరిలో 300 మెగా వాట్ల సోలార్ హైబ్రీడ్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఆత్మకూరు, కోనేటిపాళ్లం, మద్దెల చెరువు, ముట్టాల , గొరిదిండ్ల గ్రామాల్లో దాదాపు 4 వే నుంచి 5 వేల మెగా వాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. రైతులు సోలార్‌కు భూములు లీజుకు ఇచ్చేలా ఉంటే ఒక ఎకరాకు రూ.31 వేలు ఇస్తారని రెండు సంవత్సరాలకు 5 శాతం పెరుగుతుందన్నారు. 30 సంవత్సరాలు లీజ్ ఉంటుందని , రూ.50 వేల వరకు పెరుగుతుందన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఆత్మకూరు మండలానికి పీఏబీఆర్ రిజర్వాయర్ నుంచి రూ. 38 కోట్ల టెండర్లు పూర్తయ్యాయన్నారు. 22 కిలో మీటర్ల పైప్‌లైన్ మంజూరు అయిందన్నారు. ఆత్మకూరు నుంచి పాపంపేట కు రూ.27 కోట్లతో టెండర్లు పిలిచామని ఈ నెల ఆఖరులోపు టెండర్లు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నీలిమ, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, బోయ వెంకటేష్, సర్పంచ్‌లు వరలక్ష్మి, ఎర్రిస్వామి, నాగరత్నమ్మ, నరసింహా, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం



ఉచిత బోరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఆత్మకూరు: 'నేనూ రైతు బిడ్డనే .. రైతులు పడే ఇబ్బందులు , అవస్థలు నాకు తెలుసు ఎంత కష్టం వచ్చినా రైతులకు అండగా నిలుస్తా' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పంపనూరులో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలసి తోపుదుర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత బోర్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలకు మండలంలో 100 బోర్లు వేయించాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా వందల సంఖ్యలో బోర్లు వేయించామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రిస్వామి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప, శివారెడ్డి పాల్గొన్నారు.

నేడు అనంతకు కంచి పీఠాధిపతి

అనంతపురం కల్చరల్: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతీ స్వామీజీ గురువారం అనంతకు రానున్నారు. రాత్రి 8.30 గంటలకు సోముదొడ్డి గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయానికి వచ్చి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 5:30 గంటలకు కర్నూలుకు వెళ్తారు.

'గడప గడప' ఓ బృహత్తర కార్యక్రమం



సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

అనంతపురం క్రైం: ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకు ప్రారంభించిన గడప గడపకూ మన ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమమని మేయర్ వసీం పేర్కొన్నారు. నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సందర్భంగా బుధవారం నగరపాలక సంస్థలో సంబరాలు జరుపుకున్నారు. మేయర్ వసీం కేక్ కట్ చేసి, డిప్యూటీ మేయర్లు, కమిషనర్, కార్పొరేటర్లకు అందజేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలోని 50 డివిజన్లలోని 74 సచివాలయాల పరిధిలో రూ.14.80 కోట్ల నిధులు మంజూరుకావడం జరిగిందన్నారు. 302 అభివృద్ధి పనులు (రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాల్స్) చేపట్టడం జరిగిందన్నారు. అందులో 80 పనులు పూర్తి చేశామన్నారు. రానున్న ఐదారు నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. ఆయన నాయకత్వంలో రూ.800 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవల రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. నగరంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుంటే ప్రతిపక్షాలు చౌకబారు రాజకీయాలు చేస్తున్నాయని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గత టీడీపీ వర్గపోరుతో నగరంలో భయాందోళన వాతావరణంతో పాటు అభివృద్ధి కుంటుపడిందన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాహసానికి పెట్టింది పేరని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించిన సీఎం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఏడాదిపాటుగా నగరంలోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమాన్ని తెలియజేయడంతో పాటు స్థానిక సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపారన్నారు. కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కాంట్రాక్టర్లకు రూ.1.8 కోట్లు (కోటి 80 లక్షలు) విడుదల చేయడం జరిగిందన్నారు. మరో రూ.6 కోట్లు త్వరలో విడుదలకానున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్ కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, సంపంగిరామాంజినేయులు, శేఖర్‌బాబు, రాజేశ్వరి, జయలలిత, సుజాత, దుర్గాదేవి,అబూసలేహా, శ్రీనివాసులు, ఇస్హాక్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, ఎస్ఈ సతీష్‌చంద్ర, ఈఈ రామమోహన్ రెడ్డి, డీఈలు రాంప్రసాద్‌రెడ్డి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మేలు మరువలేం

- గడప గడపకూ మన ప్రభుత్వంలో లబ్ధిదారుల హర్షం



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం క్రైం: అమ్మఒడి, చేయూత, ఆసరా, తదితర పథకాలతో ప్రభుత్వం చేసిన మేలును మరువలేమని లబ్ధిదారులు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో తమ ఆనందాన్ని పంచుకున్నారు. బుధవారం నగరంలోని 5వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జయలలితతో కలసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి.. ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. కార్పొరేట్ స్కూళ్లలా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం మార్చిందని, తన తమ్ముడి కుమారుని ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించామని, సీఎం తీసుకువచ్చిన గొప్ప మార్పులకు ధన్యవాదాలని అస్లాంబాషా అనే వ్యక్తి సంతోషం వ్యక్తం చేశాడు. అమ్మఒడి డబ్బులను తమ పాప భవిష్యత్తుకు వినియోగిస్తున్నట్లు రమేష్ అనే వ్యక్తి పేర్కొన్నారు. పిల్లల చదువును నిర్లక్ష్యం చేయకుండా స్కూళ్లకు పంపాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్థానికులకు సూచించారు. ఆసరా ద్వారా వచ్చిన రూ.17,000లతో సొంతంగా వ్యాపారం చేసుకుని జీవిస్తున్నట్లు శ్రావణి అనే మహిళ ఆనందాన్ని పంచుకుంది.

కుటుంబ సభ్యుల్లా సేవలు..

సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఎలాగ ఉందని, మీకేమైనా ఇబ్బందులున్నాయానని స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు. అందుకు వలంటీర్లు కుటుంబ సభ్యుల్లా ప్రతి నెలా పింఛన్, ఇతరత్రా పథకాలు వర్తింపజేసేలా చూస్తున్నారని లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో వలంటీర్లు మరిన్ని సేవలందించాలని పేర్కొన్నారు.

స్థలాలు కేటాయిస్తాం

ఉప్పరపల్లి, కామారుపల్లి లబ్ధిదారులకు త్వరలో అనువైన ప్రాంతాల్లో స్థలాలను కేటాయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులందరికీ ఇంటి స్థలాలను అందిస్తామన్నారు. శ్రీనివాస్‌నగర్‌లో పలు విద్యుత్ స్తంభాలను మార్చాలని విద్యుత్‌శాఖాధికారులను ఆదేశించారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా మురుగు వెళ్లేలా కాలువల్లో స్లోప్ ఉండేలా చూసుకోవాలని ఏఈ శంకర్‌ను ఆదేశించారు.

అడ్మిన్, ఎనర్జీ కార్యదర్శిపై ఆగ్రహం

ప్రజలకందే సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 7వ డివిజన్ అడ్మిన్ కాటమయ్య, ఎనర్జీ కార్యదర్శి బాషాపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డబుల్ మీటర్లున్నట్లు చూపుతున్నాయన్న ఫిర్యాదులు వస్తుంటే ఏం చేస్తున్నారన్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గౌస్‌బేగ్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, కొర్రపాడు హుస్సేన్‌పీరా, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సంపంగి రామాంజినేయులు, అనిల్ కుమా ర్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని సన్మానించిన కాంట్రాక్ట్ ఉద్యోగులు

అనంతపురం క్రైం: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకోవడం హర్షణీయమని కాంట్రాక్ట్ ఉద్యోగులు అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడంతో బుధవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని సన్మానించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చారంటే అది నెరవేర్చి తీరుతారన్నారు. మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులను దశలవారీగా క్రమబద్ధీకరణకు అన్ని చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగుల సంఘం నాయకులు రాఘవేంద్ర, హరి, కిరణ్, మధు, శివయ్య, నాగరాజు, అంజి, రమేష్, తదితరులున్నారు. అలాగే కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు, భాను, బోనాల సహజీర్ తదితరులు ఎమ్మెల్యే అనంతను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం 16 ఏళ్ల ఎదురుచూసిన తమకు జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఊరట లభించిందని వారు పేర్కొన్నారు.

'ఎన్‌రోల్డ్ ఏజెంట్ కోర్స్'తో భవిష్యత్తు

రాప్తాడురూరల్: ప్రపంచీకరణలో భాగంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి అన్నారు. ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'యూఎస్ టాక్సేషన్'లో ఎన్‌రోల్డ్ ఏజెంట్ కోర్స్ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు వెబ్‌నార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌రోల్డ్ ఏజెంట్ కోర్స్ మంచి భవిష్యత్తును ఇస్తుందన్నారు. వెబ్‌నార్ స్పీకర్ పి.శ్రీలక్ష్మి, వెబ్‌నార్ కన్వీనర్ షర్మిల రామయ్య మాట్లాడుతూ.. అమెరికా లాంటి దేశాల్లో ఈ కోర్సు నేర్చుకోవడం వల్ల ఉపాధి అవకాశాలు విరివిగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యాపకులు ఆర్. శ్రీరాములు, డాక్టర్ జి.రంగనాథ్, డాక్టర్ ఎం.మల్లికార్జున, డాక్టర్ యూ. ప్రభాకర్‌రెడ్డి, సి.రవీంద్రరెడ్డి, సి.సుమంగళి, కె.గురుమోహన్ పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీని బలోపేతం చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లాలో ఆమ్ ఆద్మీ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌కే పట్టేమ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జిల్లా కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కన్వీనర్లను, పార్లమెంట్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకున్నామన్నారు. అనంతపురం పార్లమెంట్ అధ్యక్షుడిగా వీవీ రామకృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా జ్యోతిని ఎన్నుకున్నారు. తాడిపత్రి (జగదీశ్వర్‌రెడ్డి), శింగనమల (మీసాల నారాయణస్వామి), గుంతకల్లు (మహ్మద్ గౌస్)ను ఎన్నుకున్నామన్నారు. అలాగే అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం కన్వీనర్లను ఎన్నుకున్నారు. పార్టీని బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, అసదుల్లా, హరినాయుడు, అడ్వకేట్ శ్రీనివాస్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ సేవలు ప్రశంసనీయం

అనంతపురం సెంట్రల్: అనంతపురం ఏటీఎం (కమర్షియల్)గా విధులు నిర్వహించిన అనతి కాలంలోనే కార్గో బిజినెస్ పెంపునకు విశేషంగా కృషి చేసిన అమరనాథ్ సేవలు ప్రశంసనీయమని అనంతపురం డిపో మేనేజర్ అన్నారు. ఎమ్మిగనూరు డిపో మేనేజర్‌గా బదిలీపై వెళ్తున్న అమర్‌నాథ్‌కు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్, అనంతపురం, గుత్తి, ధర్మవరం, కదిరి, రాయదుర్గం డీఎంఈ, ఎస్ఎస్‌పీ ఇంచార్జి సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సైకోపై చర్యలు తీసుకోండి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రేమ పేరుతో నిత్యం వేధింపులకు దిగుతున్న సైకో నుంచి రక్షణ కల్పించాలని ఓ యువతి అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డెప్పను కోరింది. వివరాలు.. స్థానిక అశోక్ నగర్‌కు చెందిన ఓ యువతి(మాలతి) పేరు మార్చాం. అదే కాలనీలో నివాసం ఉంటున్న రోషన్ అనే యువకుడు చాలా కాలంగా యువతిని వేధిస్తున్నాడు. 10 రోజుల క్రితం యువతి పుట్టిన రోజు నాడు కేక్ తెప్పించి బలవంతంగా ఆమెను అటకాయించి కేక్ కట్ చేయించాడు. ఈ క్రమంలో యువతి ఏడ్చినా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే ఆమెతో కలసి ఉన్నట్లు ఫోటోలు తీసుకుని వాటిని చూపించి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. దీంతో బాధిత యువతి కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని చెప్పింది. బాధిత కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయాన్ని సీఐ దృష్టికి తీసుకెళ్లడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చెరువు కట్టపై ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన లక్ష్మి అనే వివాహిత బుధవారం సాయంత్రం చెరువు కట్టపై పురుగు మందు సేవించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శ్రీశ్రీనగర్‌కు చెందిన ఉప్ప శ్రావణి అనే యువతి అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన వారి ఇళ్లలో ఆరా తీసిన ఆచూకీ లభించలేదంటూ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

న్యాయమైన పరిహారం చెల్లించాలి

అనంతపురం అర్బన్: పాములాయి నుంచి తాడిపత్రి మండలం బుగ్గకోన వరకూ చేపట్టిన 544డీ జాతీయ రహదారిలో ఇళ్లను కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని సీపీఎం జిలా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడు మండలాల మీదుగా వేస్తున్న జాతీయ రహదారి నిర్మాణంలో దాదాపు 500 కుటుంబాలు ఇళ్లు, సాగు భూమిని కోల్పోతున్నాయన్నారు. 2019 నాటి భూమి విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తే నిర్వాసితులకు న్యాయం జరగదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కాకుండా జాతీయ రహదారి నిబంధనల ప్రకారం చెల్లించాలనే నిర్ణయం సరికాదన్నారు. చెల్లించే పరిహారం ప్రస్తుతం భూమి మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇచ్చి నిష్పక్షపాతంగా న్యాయం చేయాలన్నారు.

రూ.10 వేల అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లింపు

అనంతపురం: ఎస్కేయూ అనుబంధ డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు అపరాధ రుసుముతో సహా గడువు ముగిసింది. ఈనెల 15వ తేదీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ, బీఎస్సీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆరుగురు విద్యార్థులు అనారోగ్యం కారణాలతో పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించలేదు. దీంతో ఎస్కేయూ ఉన్నతాధికారులకు విన్నవించుకోవడంతో రూ.10 వేలు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. డిగ్రీ ఆఖరు సెమిస్టర్ కావడంతో తత్కాల్ ఫీజు చెల్లించడానికి సమ్మతించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన వెసులుబాటుకు విద్యార్థులు అంగీకారం తెలిపి వెంటనే బ్యాంకు చలానా తీసి దరఖాస్తు చేశారు.

డైట్ నిర్వహణ పక్కాగా ఉండాలి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డైట్ సెంటర్‌ను అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధిక పౌష్టికాహారం, నాన్ కార్బొహైడ్రేట్, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎటువంటి భోజనాన్ని సరఫరా చేస్తున్నారని ఆరా తీశారు. టీబీ, కాలిన గాయాలతో అడ్మిషన్‌లో ఉన్న వారికి హై ప్రోటీన్ డైట్ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డైట్ నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. రోగులకు మంచి, నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎమర్జెన్సీ, లేబర్ వార్డులో సర్జికల్ ఐటమ్స్ వినియోగం ఎక్కువగా ఉందని ఫార్మసిస్టులు అసిస్టెంట్ ఆర్ఎంఓకు తెలియజేశారు. సర్వజనాస్పత్రిలోని మార్చురీలో మూడు ఫ్రిజ్‌లను రిపేరీ చేయించేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ బుధవారం చర్యలు తీసుకున్నారు. ఫోరెన్సిక్ విభాగం వైద్యులు ఫ్రిజ్‌లు చెడిపోవడంతో మృతదేహాలను గదుల్లోనే ఉంచాల్సి వస్తోందంటూ ఫిర్యాదు చేయడంతో స్పందించారు.

విధులకు సక్రమంగా హాజరుకాకపోతే చర్యలు

రాప్తాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ సాల్మన్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని హంపాపురం, గొల్లపల్లి గ్రామ సచివాలయలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, బయోమెట్రిక్ హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు మూడు విడతలుగా బయోమెట్రిక్ వేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, వైఎస్సార్ బీమా రెన్యూవల్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు.

మెస్ బిల్లుల బకాయిలపై దృష్టి సారించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు మెస్ బిల్లులు చెల్లించకపోతే ఎలా అని వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. వర్సిటీలో న్యాయశాస్త్ర విభాగం విద్యార్థులను తరగతులకు అనుమతించక పోవడంతో ఆందోళన చేసిన నేపథ్యంలో వీసీ హాస్టల్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులన్నీ పరిశీలించారు. గత పది సంవత్సరాలుగా మెస్ బిల్లులు బకాయి ఉన్న వారి వివరాలన్నింటిని పరిశీలించి నోటీసులు ఇవ్వాలని కోరారు. ఉద్యోగం చేస్తున్న వారు అయితే వెంటనే సంబంధిత విభాగానికి నోటీసులు జారీ చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోపు మెస్ బకాయిలు చెల్లించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పథకాల అమలుకు తొలి ప్రాధాన్యత

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలో ప్రభుత్వ పథకాల అమలుకు తొలి ప్రాధాన్యత ఇస్తానని నూతన ఎంపీడీఓ వై.కొండయ్య పేర్కొన్నారు. నంద్యాల జిల్లా పగిద్యాల మండల ఈఓఆర్డీగా పని చేస్తున్న ఈయన్ను పదోన్నతిపై అనంతపురం మండలం ఎంపీడీఓగా నియమించారు. ఈ క్రమంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం రేవనూరుకు చెందిన వై.కొండయ్య ఎస్కేయూలో పీజీ చదివారు.

ఆర్బీకేల ద్వారా పత్తి విత్తనాలు అందించాలి

అనంతపురం అగ్రికల్చర్: రైతు భరోసా కేంద్రాల ద్వారా పత్తి విత్తనాలు సరఫరా చేసి, నాసిరకమైన పత్తి విత్తనాలు అరికట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్ రెడ్డి కోరారు. అనంతపురం జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి. శివా రెడ్డి, బీ.హెచ్. రాయుడు, కమిటీ సభ్యులు ఎం.పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.